నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని నీరజ కాలనీ, మెహబూబ్ గార్డెన్, ఛాబ్రా, అక్బర్‌బాగ్, గ్రామర్ కాలనీ, ప్రో ఆగ్రో సీడ్స్, సూర్యనగర్, ఛాబ్రా ఎన్‌క్లేవ్, రాహుల్ కాలనీ, అడమ్స్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని అధికారులు తెలిపారు.

24న బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

గౌలిపురా: గౌలిపురా మార్కెట్ రాంసింగ్‌బాడలోని బంగారు మైసమ్మ మహంకాళి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 24న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 22న ఆలయంలో నవ కలశ స్థాపన, 23న అమ్మవార్లకు మహాభిషేకం, 24న ఉదయం 8 గంటలకు దుర్గా హోమం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న కేవీ వసంతమ్మ బృందం

అబిడ్స్: గుడిమల్కాపూర్ మార్కెట్ వద్ద శ్రీ చిన్నకేశవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కేవీ వసంతమ్మ బృందం సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాజా వెంకట వసంత, సుజాత, మణి, ప్రభా, ప్రకాష్, భాను తదితరులు ఉన్నారు.

సన్మానం


చందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీ కాలనీ రెసిడెన్షి ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ చందర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కాలనీకి రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినందుకు ఫేస్–2 ఉద్యోగులు, సిబ్బంది బాల్‌రెడ్డి, సురేందర్, విజయ్‌కుమార్, రమేష్, రాధాకృష్ణ, సత్యం, కృష్ణ, భరత్, సందీప్, కిరణ్, కేవీఎస్‌రావులు కార్పొరేటర్‌ను సత్కరించి అభినందించారు.

కుస్తీ పోటీలు ప్రారంభం



గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో హిందూ వాహిణి ఛత్రపతి శివాజీ కుస్తీ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం పోటీలకు క్రేజ్ పెరుగుతుందని, చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారుల సంఖ్య పెరుగుతోందన్నారు. పకడ్బందీ ఏర్పాట్లతో కోచ్‌ల పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ పహిల్వాన్, చంద్రకాత్, చావాన్, టింకు పైల్వాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భౌతికశాస్త్ర ప్రయోజనాలపై వర్క్‌షాప్

గన్‌ఫౌండ్రీ: భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్ రంగం దైనందిన జీవితంలో మనం ఉపయోగించే అన్ని వస్తు సేవలలో ప్రధాన పాత్రను పోషిస్తున్నాయని మహాత్మాగాంధీ యూనివర్సిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్. గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అబిడ్స్‌లోని స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రయోజనార్థం భౌతికశాస్త్ర ప్రయోజనాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐయూఏసీ ప్రధాన శిక్షకులు వివి.సత్యనారాయణ, కళాశాల రిసెర్చ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్, కార్యదర్శి కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు రాజేష్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వర్క్‌షాప్ కన్వీనర్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి తదితరులు


లక్ష్మినగర్ చౌరస్తా వద్ద..


చాంద్రాయణగుట్టలో..

గులాబీ శ్రేణుల్లో జోష్

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న సలావుద్దీన్ లోధి


ఎంఎన్‌జె కేన్సర్ ఆసుపత్రిలో..

చార్మినార్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. చార్మినార్ శాసనసభ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోధి ఆధ్వర్యంలో పురానీహవేలీలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి కేసీఆర్ చేసిన కృషి అమోఘం అన్నారు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ పార్టీ చాంద్రాయణగుట్ట డివిజన్ అధ్యక్షుడు టి.నరేష్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర శివ కుమార్, సాయి కిరణ్, బాలకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో..

నాంపల్లి: కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో కేసీఆర్ సేవాదళం రాష్ట్ర అధ్యక్షుడు, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మహ్మద్ ఆమేర్ ఆధ్వర్యంలో రోగులకు, రోగి సహాయకులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మహ్మద్ ఫయాజ్, ఎం.విద్యాసాగర్, మహ్మద్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

జియాగూడలో..

జియాగూడ: కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు పేదలకు బాసటగా నిలిచాయని జియాగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి అన్నారు. సోమవారం కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని దుర్గానగర్ భారత అభ్యుదయ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గుప్తా, రంగా పరందాములు, కార్వాన్ అసెంబ్లీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగి కిషోర్ కుమార్, ప్రకాష్, దేవేందర్ సాగర్, ఆకారం శ్రీనివాస్ గుప్తా, అనిత పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న నాయకులు

చార్మినార్: ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం మాదిగ జాతికే గర్వంగా ఉందని ఎమ్మార్పీఎస్ చార్మినార్ శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జి నరసింహ స్వామి మాదిగ అన్నారు. ఈ మేరకు ఆయన చార్మినార్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చేన్నపాక యాదగిరి, వివేకానంద నగర్ బస్తీ అధ్యక్షులు సదానంద్, గౌరవ అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పందుల జంగయ్య, పూరణాపూల్ డివిజన్ సీనియర్ నాయకులు లింగాల వినోద్, నాగరాజ్ , సిద్దు, కుమార్ తదితరుల కలిసి మందకృష్ణ మాదిగను కలిసి సన్మానించారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి


వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వీసీ జానయ్య తదితరులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, విశ్వవిద్యాలయం వీసీ జానయ్య జయంత్యుత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో చదువుకుని వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదిగి ఆరు నెలల క్రితం ఖమ్మంలో మృతి చెందిన అశ్విని పేరు మీదుగా ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతి రోజు అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. అవార్డుతో పాటు రూ. 5లక్షల నగదును ఇవ్వనున్నట్లు రాములు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రమేష్ నాయక్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి


కల్చరల్ వాక్‌లో యువ మోడళ్లతో డాక్టర్ ఐశ్వర్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని మిస్ గ్లోబ్ ఇండియా డాక్టర్ పి.ఐశ్వర్య అన్నారు. సోమవారం కళాభవన్‌లో ప్రకాక్ హీల్ ఫౌండేషన్, అపర్ణ ఫైనార్ట్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కల్చరల్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ యువకులు సాంప్రదాయ వస్త్రధారణలతో ర్యాంప్‌వాక్ చేసి అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రాశ్చాత సంస్కృతిని ఒంటపట్టించుకుంటూ మన సంస్కృతిని కనుమరుగు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మానస ఆర్ట్ థియేటర్, ఫౌండేషన్ల నూతన లోగోలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆమని ప్యాషన్ డిజైనర్లు, ఎం.ఉమా, వివి.లక్ష్మీదుర్గా, ప్రవళిక, మానస ఆర్ట్ థియేటర్ కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి స్పందన కరువు

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత జోనల్ అధికారులు పదే పదే కోరుతున్నా పాతబస్తీ ప్రజలు పట్టించుకోవడం లేదు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి సంబంధిత విభాగాలచే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, మలేరియా సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, డీఈఈ సత్యనారాయణరెడ్డి, ఫలక్‌నుమా సర్కిల్ డీఈఈ వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మఖ్దూమ్ మోహియుద్దీన్ జాతీయ పురస్కారానికి భాస్కర్ ఎంపిక

చార్మినార్: సాహితీ వేత్త, ప్రముఖ అనువాదకులు, పరిశోధకులు, కవి, బహు భాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌ను సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారానికి (2025) ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ అధ్యక్షుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కవిత్వం, భాష, అనువాదం, పరిశోధన, విమర్శ తదితర రంగాల్లో డాక్టర్ నలిమెల భాస్కర్ చేసిన విశేషమైన కృషికి గానూ వారిని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ సభ్యులు వివరించారు. ఇప్పటికే కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వారి కాళోజీ పురస్కారంతో పాటు అనేక పురస్కారాలను అందుకున్న భాస్కర్‌కు ఈనెల 24న సిటీ కాలేజ్ ఆడిటోరియంలో అవార్డు అందజేయనున్నామన్నారు. అవార్డు కమిటీ కన్వీనర్ డాక్టర్ విప్లవదత్ శుక్ల, సభ్యులు డాక్టర్ ఏలూరి యాదయ్య, డాక్టర్ కోయి కోటేశ్వరరావు భాస్కర్‌కు అభినందనలు తెలియజేశారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి


టోలిచౌకీ వద్ద పర్యటిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని కార్వాన్, లంగర్‌హౌస్, నానల్‌నగర్ తదితర డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జలమండలి డివిజన్ 3, 4లలో జరుగుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయించాలన్నారు. మరో వైపు ఎండిలైన్స్, టోలిచౌకీ, టూంబ్స్ చౌరస్తా, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్లు, వరద నీటి పైప్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేయించాలన్నారు. లక్ష్మీనగర్ మెయిన్ రోడ్డు, గుడిమల్కాపూర్ మార్కెట్, కార్వాన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్ తవ్వకాల వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుందని పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా తదితరులున్నారు.

నియామకం


నియామక పత్రాలు అందుకుంటున్న నవీన్‌కుమార్ గౌడ్, నీలకంఠం గౌడ్, భాస్కర్‌గౌడ్

జియాగూడ: పూలెకోన గీతా పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని సంఘం నూతన అధ్యక్షుడు కొత్త నవీన్‌కుమార్ గౌడ్ అన్నారు. పూలెకోన గీతా పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. నూతన అధ్యక్షుడిగా కొత్త నవీన్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా నిర్మల నీలకంఠం గౌడ్, కార్యదర్శిగా బుర్రా భాస్కర్ గౌడ్, మేనేజింగ్ కమిటీ మెంబర్లు ఎస్.సంగీత, వై.యాదమ్మ తదితరులు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ స్టేట్ కో ఆపరేటీవ్ ఎలక్షన్ అథారిటీ రామ్మోహన్ వారికి నియామకపత్రాన్ని అందజేశారు. ఐదేళ్ల పాటు ఈ నూతన సంఘం కొనసాగుతుందని రామ్మోహన్ ప్రకటించారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

చాంద్రాయణగుట్ట: ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభంకానున్న చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్ గౌడ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..21న స్వామి వారి తిరు కల్యాణోత్సవం జరుగుతుందని, ఆ వేడుకలో పాల్గొనాలని కోరారు.


మంత్రి దామోదర రాజనర్సింహాను ఆహ్వానిస్తున్న మహేష్‌గౌడ్

పట్టుదలతో సాధన చేస్తే మొదటి ప్రయత్నంలోనే

సివిల్ సర్వీసెస్ సాధించవచ్చు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ డీపీ. అగర్వాల్

గోల్కొండ: పట్టుదలతో సాధన చేస్తే సివిల్ సర్వీసెస్ పరీక్షను మొదటి ప్రయత్నంలోనే సాధించవచ్చని యూపీఎస్‌సీ మాజీ చైర్మన్ డాక్టర్ డీపీ. అగర్వాల్ అన్నారు. సోమవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హౌ టూ క్రాక్ సివిల్ సర్వీసెస్ ఇన్ ది ఫస్ట్ అటెంట్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. యూపీఎస్సీ పరీక్షల్లో గత కొంత కాలంగా ఇంజినీరింగ్ పట్టభద్రులు ఎక్కువగా పరీక్ష రాస్తున్నారన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పరిశీలిస్తే ఏటా సివిల్స్ రాసే అభ్యర్థుల్లో సుమారు 3 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులే ఉన్నారన్నారు. సివిల్స్‌లో విజయం సాధించాలంటే క్రమ పద్ధతిలో ప్రణాళికాబద్ధంగా సంసిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. ఎక్కడో ఒక పొరపాటు జరిగితే ఒక సంవత్సరం వృథా అవుతుందని ఇలాంటి వారు నిరుత్సాహ పడకుండా జరిగిన పొరపాట్లను సవరించుకుంటూ మళ్లి నూతన ఉత్సాహంతో పరీక్షకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన కేరళకు చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ సాధించిన విజయాలను ఉటంకించారు. కార్యక్రమంలో డాక్టర్ భవానీ శంకర్, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, గణేష్ తదితరులున్నారు.

చేతిపంపులకు మరమ్మతు చేయండి


శాలిబండలో..

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లోని చేతి పంపులు అలంకార ప్రాయంగా మారాయి. మరమ్మతు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయని అధికారులు, సిబ్బంది సాకులు చెబుతూ మరమ్మతులను విస్మరిస్తున్నారు. రాబోయేది పండుగల సీజన్ నీటి అవసరాలు, వాడకం ఎక్కువగా ఉంటాయి. కుళాయిల్లో సరఫరా అయ్యే సరిపోవు. రోజు వారి అవసరాల కోసం బోరు నీరు ఎంతో అవసరం. సంబంధిత అధికారులు స్పందించి పని చేయాలని చేతి పంపులకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పాత బస్తీవాసులు కోరుతున్నారు.

గోషామహల్ నాలా నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలి


నాలాను సందర్శిస్తున్న కేడీ ధినేష్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నాలా నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు కేడీ.ధినేష్ డిమాండ్ చేశారు. సోమవారం గోషామహల్‌లోని నాలా నిర్మాణ పనులను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ..నాలుగు నెలల్లో నాలుగు సార్లు నాలా కూలినా జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులు కానీ నాలాను పర్యవేక్షించకపోవడం దారుణమన్నారు. నాలా మొత్తం నిర్మాణ పనులను నాణ్యమైన సిమెంట్, ఐరన్‌తో చేపట్టాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఔటర్ ర్యాంప్ పనులు ప్రారంభం

మణికొండ: నానక్‌రాంగూడ సర్కిల్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఔటర్‌పై చేపట్టిన ర్యాంప్ పనులు ప్రారంభమయ్యాయి. గచ్చిబౌలి నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు రాకపోకలు సాగించే ఐటీ ఉద్యోగులతో పాటు ఇతరులు నానక్‌రాంగూడ సర్కిల్‌లో ఔటర్ రింగ్ రోడ్డు దిగుతున్నారు. దీంతో సర్కిల్‌లో సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయి అర గంటకు పైగా సర్కిల్ దాటేందుకు వాహనదారులు వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో నానక్‌రాంగూడ సర్కిల్ దాటిన తర్వాత కొత్తగా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు నిర్ణయించారు. ర్యాంప్ ఏర్పాటు కోసం గతంలోనే 80 మీటర్ల పొడవున సైకిల్ ట్రాక్‌ను గతంలోనే తొలగించారు. పనులకు ఇటీవల టెండర్ పిలవడం, ఫైనల్ కావటంతో సోమవారం నుంచి పనులను ప్రారంభించారు. ఈ నెలాఖరు లోపు పనులను పూర్తి చేసి ర్యాంప్ రోడ్డును ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ర్యాంపు రోడ్డు ప్రారంభమయితే గచ్చిబౌలి నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు వచ్చే ప్రయాణికులు నానక్‌రాంగూడ సర్కిల్ దాటాక ఔటర్ దిగి సర్వీసు రోడ్డులో రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతుందని వారు వివరించారు.

ప్రొఫెసర్లకు ఎక్సలెన్సీ అవార్డులు


ప్రొఫెసర్ కమలాకర్ శర్మ

చార్మినార్: ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పలువురు ప్రొఫెసర్లకు ఎక్సలెన్సీ అవార్డులను అందజేయనున్నామని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నలుగురు ప్రొఫెసర్లను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 21న అబిడ్స్ మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని సెమినార్ హాల్లో ఈ అవార్డులను అందజేయనున్నామన్నారు. హెచ్‌ఓడీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ హిందీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రొఫెసర్ రేఖారాణి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం సీనియర్ ప్రొఫెసర్ కమలాకర్ శర్మ, సెంట్రల్ హైదరాబాద్ యూనివర్సిటీ సంస్కృత విభాగం అధినేత ప్రొఫెసర్ అంబా కులకర్ణి, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ అబుల్ కలాంకు అవార్డులను అందజేయనున్నామన్నారు.

ఎండలొచ్చాయ్.. మట్టి కుండలొచ్చాయ్


చాంద్రాయణగుట్టలో కుండలను తయారు చేస్తున్న యువకుడు


అమ్మకానికి ఉంచిన కుండలు

చాంద్రాయణగుట్ట: వేసవిలో భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది ఫ్రిజ్ నీరు, శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతుంటారు. ఇలాంటివి తాగడంతో ఆ క్షణం వరకు దప్పిక తీరినా మళ్లీ దాహం వేస్తోంది. కానీ చల్లటి మట్టి కుండలోని నీరు తాగితే ఆ ఊరట వేరేలా ఉంటుంది. ఎంత ఎండలో వెళ్లి వచ్చినా కుండలోని నీరు తాగితే వచ్చే ఆ భావన ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ప్రస్తుతం ఎండలు మొదలవుతుండటంతో పాతబస్తీవాసులంతా కుండలను కొనుగోలు చేస్తున్నారు.

పాత నగరంలో కుమ్మరివాడీలు..

పాత నగరంలోని పలు బస్తీల్లో కుమ్మరి కులస్తులు అధిక సంఖ్యలో ఉండేవారు. ఈ క్రమంలోనే పాత నగరంలోని పలు కాలనీలకు కుమ్మర్‌వాడీలుగా పిలవబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో 40–50 కుటుంబాల వరకు కుండలను తయారు చేస్తున్న క్రమంలో కుమ్మరి వాడీలుగా ప్రసిద్ధి చెందాయి. ఇలా చాంద్రాయణగుట్ట కుమ్మర్‌వాడీ, లాల్‌దర్వాజా కుమ్మర్‌వాడీ, గౌలిపురా కుమ్మర్‌వాడీ, అలియాబాద్ కుమ్మర్‌వాడీ, ఈదిబజార్ కుమ్మర్‌వాడీలుగా ప్రసిద్ధి చెందాయి. ఇందులో ప్రస్తుతం చాంద్రాయణగుట్ట, లాల్‌దర్వాజా, గౌలిపురాలలో మాత్రమే ఇప్పటికే కుండలను తయారు చేస్తున్నారు.

తయారీ వెనుక దాగి ఉన్న శ్రమ..

కుండ తయారీ వెనుక ఎంతో శ్రమ దాగి ఉంటుందని చాలా మందికి తెలియదు. కుండల తయారీ కోసం మొదటగా నగర శివారులోని 50 కిలోమీటర్ల నుంచి బంకమట్టిని తీసుకొస్తారు. అలా తీసుకొచ్చిన మట్టిని అవసరమైన మేర సగం పూట ఆరుబయట ఎండపెడుతారు. అనంతరం ఆ మట్టిని 15 నిమిషాల పాటు తొట్టిలో నానపెడుతారు. తదనంతరం జల్లెడతో వడపోస్తారు. అలా వచ్చిన మట్టిని 24 గంటల పాటు ఆరబెట్టి. పూర్తి స్థాయిలో తొక్కుతారు. అలా తొక్కిన అనంతరం మృదువుగా మారిన మట్టిని 'సారె'పై వేసి తిప్పుతూ కుండలను తయారు చేస్తారు. కుండను రూపంలోకి తీసుకొచ్చిన అనంతరం ఆరబెట్టి చివరకు ఒక్కరోజు వాములో కాల్చడం ద్వారా కుండ తయారవుతోంది.

ప్రభుత్వ సహకారం కావాలి..



ఎన్నో ఏళ్ల నుంచి కుండలను తయారు చేస్తున్నా. కుల వృత్తులను ప్రోత్సహించేలా తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రుణాలు కూడా ఇవ్వడం లేదు. పైగా కట్టె మిషన్లు బంద్ కావడంతో వాము కాల్చడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎంత ఎండలు ఉన్నప్పటికీ కుండలోని నీరు తాగితే ఎంతో ఉపశమనంగా ఉంటుంది.

–నరేష్, కుమ్మర్‌వాడీ, చాంద్రాయణగుట్ట